ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 5 మార్చి 2025 | 5



రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (బుధ)	సా.6.20
	సహరి (గురు)	ఉ.4.58



విజయానందం : కోనసీమ జిల్లా మామిడికుదురులో బాణసంచా కాలుస్తున్న కూటమి నాయకులు

తాబేళ్ల సంతానోత్పత్తికి తగిన చర్యలు చేపట్టండి: కలెక్టర్

ఉప్పలగుప్తం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాబేళ్ల సంతానోత్పత్తికి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా వాటి ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అటవీశాఖ అధికారులకు సూచించారు. వాసాలతిప్ప సముద్రతీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సంరక్షణ కేంద్రం ప్రొటెక్షన్ హెల్పర్లతో చేపట్టే కార్యక్రమాలను అటవీశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు 112 తాబేళ్లు సంరక్షణ కేంద్రానికి చేరుకుని గుడ్లు పెట్టి వెళ్లాయని జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు.



భౌ బోయ్!

- వీధివీధినా కుక్కలు
- భయం..భయంగా బయటకు
- కానరాని నివారణ చర్యలు

జనం బయటకు రావాలంటేనే భౌబోయ్ అంటూ భయపడుతున్నారు.. ఎందుకంటే వీధుల్లో కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితులు దాపురించాయి. కుక్క కరవకుండా.. అరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. కాళ్లూ, చేతులూ విరగ్గొట్టుకుంటున్న సంఘటనలు రోజూ ఉంటున్నాయి. ఇప్పుడు ఉష్ణోగ్రతలు ముదురుతుండడంతో కుక్కల్లో హీట్ స్ట్రెస్ వల్ల విపరీత ప్రవర్తన మరీ ఎక్కువ అవుతుంది. నీళ్లు, నీడ, ఆహారం దొరక్కపోవడంతో రెచ్చిపోతుంటాయి. ఏ మాత్రం తేడా వచ్చిందో కాటు తప్పదు. మరో వైపు రేబిస్ సోకిన కుక్కలు వీధుల వెంట కనిపిస్తూనే ఉంటున్నాయి.. అయినా పట్టించుకునేవారే లేరు.. కుక్కల నివారణకు చర్యలూ కానరావడం లేదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుక్కల ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం.

6

పేరాబత్తులకే.. పట్టాభిషేకం



పేరాబత్తులకు మిఠాయి తినిపిస్తున్న టీడీపీ నాయకుడు

విజేత రాజశేఖరంను అభినందిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు

కూటమికే గ్రాడ్యుయేట్లు జేజేలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీదే
- పేరాబత్తుల రాజశేఖరానికి 70,421 ఓట్ల ఆధిక్యత
- వీరరాఘవులుకు నిరాశ
- 30 గంటలపాటు లెక్కింపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో తొలిసారిగా తెలుగుదేశం పతాక రెపరెపలాడింది. ఆ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యతతో గెలుపొందారు. సుమారు 30 గంటలకుపైగా సాగిన ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ప్రారంభమై మంగళవారం మధ్యాహ్నం నాటికి ముగిసింది. ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి తెలుగుదేశం అభ్యర్థి ఆధిక్యతతో దూసుకుపోయారు. ఎక్కడా వెనుతిరిగి చూడలేదు. రౌండ్ రౌండ్‌కి 15 వేలకు తగ్గకుండా ఓట్లు సాధించడం, తన సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుపై ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రులు తెలుగుదేశం వైపు మొగ్గారు. రాజశేఖరానికి భారీ మెజార్టీ అందించారు. ప్రాధాన్యత క్రమంలో టీడీపీ అభ్యర్థి అలవోకగా విజయం సాధించారు. చెల్లిన లక్షా 99 వేల 208 ఓట్లలో రాజశేఖరానికి లక్షా 24 వేల 702 ఓట్లు లభించాయి. మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లలో 62.5 శాతం ఓట్లు టీడీపీ అభ్యర్థికే దక్కినట్టయ్యింది. టీడీపీ అభ్యర్థి రాజశేఖరానికి 77 వేల 421 ఓట్ల ఆధిక్యత లభించింది. మొత్తం ఎనిమిది రౌండ్లలో ఏ ఒక్క రౌండ్‌లోను మిగిలిన అభ్యర్థులు రాజశేఖరంను దాటలేకపోయారు. దీనికి తోడు పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా పేరాబత్తుల. ఈ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కైవసం చేసుకోవాలని మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. కూటమి శ్రేణులు అన్నిచోట్లా ఏకమయ్యాయి. ఆఖరుకి ఓట్ల నమోదు దగ్గర నుంచి ఓటర్ల జాబితా విడుదల వరకు ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం నేతలే దగ్గరుండి పరిశీలించుకున్నారు. తప్పొప్పులను బేరీజు వేశారు. పోలింగ్ సమయంలోను తీసుకున్న జాగ్రత్తలు పేరాబత్తులకు కలిసొచ్చాయి. ఈ కారణంగానే ప్రతి రౌండ్‌లోను తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. కౌంటింగ్ ఆరంభం నుంచి ఏదొక రౌండ్‌లో తమది పైచేయి కాకపోతుందా అని ఎదురుచూసిన పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుకు నిరాశ తప్పలేదు. కాగా, వీర రాఘవులు ఓటమితో గడిచిన రెండు దఫాలుగా విజయం సాధించి ఈసారి హ్యాట్రిక్ సాధిద్దామనుకున్న పీడీఎఫ్ ఆశలు నెరవేరకుండాపోయాయి.

35 మందికీ.. ఓటు పడింది!

వ.స. అభ్యర్థి	ఓట్లు
1. పేరాబత్తుల రాజశేఖరం(టీడీపీ)	1,24,702
2. కాట్రు నాగబాబు	565
3. షేక్ హుస్సేన్	394
4. కట్టా వేణుగోపాలకృష్ణ	1017
5. కాండ్రేగుల నరసింహం	364
6. కాళ్ళూరి కృష్ణమోహన్	190
7. కుక్కల గోవిందరాజు	269
8. కునుకు హేమకుమారి	956
9. కైలా లావణ్య	365
10. గౌతమ్‌బాబు కొల్లు	317
11. చిక్కాల దుర్గారావు	665
12. తాళ్ళూరి రమేష్	201
13. దత్తాత్రేయ నోరి	567
14. దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్)	47,241
15. దొరబాబు యాళ్ళ	303
16. నీతిపూడి సత్యనారాయణ	161
17. తినిపి నాగభూషణవర్మ	68
18. పిప్పళ్ళ సుప్రజ	479
19. పేపకాయల రాజేంద్ర	199
20. బొడ్డు శ్రీనివాసరావు	152
21. బొమ్మనబోయిన వి.ఎస్.ఆర్.మూర్తి	119
22. బొమ్మిడి సన్నీరాజ్	398
23. బండారు రామ్మోహన్‌రావు	709
24. భీమేశ్వరరావు చిక్కా	254
25. మాకి దేవీప్రసాద్	146
26. మెర్ల శాస్త్రులు	103
27. మోకన అంబేద్కర్	129
28. రాజపూడి	95
29. జి.టి.రామారావు	39
30. రేవులగడ్డ ముఖేష్‌బాబు	96
31. వానపల్లి శివగణేష్	772
32. శ్రీనివాస్ విష్ణువరుల	190
33. ఎం.శ్రీనివాసరావు	41
34. జి.వి.సుందర్	16,183
35. హసన్ షరీఫ్	759

ఒక్కో రౌండ్‌కి 28 వేల ఓట్లు చొప్పున లెక్కించారు.. అలా 8 రౌండ్లలో మొత్తంగా 1,99, 208 ఓట్లు లెక్కించారు. తొలి రౌండ్ నుంచి టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. తర్వాత రాఘవులు ఉన్నారు.

8 రౌండ్లలో ఇద్దరికీ ఓట్లు ఇలా...

రౌండ్లు	పేరాబత్తుల	వీరరాఘవులు
1	16,520	5,815
2	16,212	5,421
3	16,191	5,570
4	15,482	6,446
5	15,632	6,413
6	16,254	5,949
7	16,040	5,654
8	12,371	5,973
మొత్తం	1,24,702	47,241

సుందర్‌కు మూడో స్థానం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన 35 మంది అభ్యర్థుల్లో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మొదటి, పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు దక్కిన ఓట్లలో రెండో స్థానం సాధించగా మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జి.వి.సుందర్ మూడో స్థానం దక్కించుకున్నారు.ఆయనకు 16,183 ఓట్లు దక్కాయి. మొదటి రౌండ్ నుంచి వెయ్యి ఓట్లు దాటేకొన సాగగలిగారు. మొదటి రౌండ్‌లో 1968, రెండో రౌండ్‌లో 2,238, మూడవ రౌండ్‌లో 2,119, నాల్గవ రౌండ్‌లో 2,484, ఐదవ రౌండ్‌లో 2,208, ఆరవ రౌండ్‌లో 1,741, ఏడవ రౌండ్‌లో 2,106, ఎనిమిదవ రౌండ్‌లో 1,319 ఓట్లు దక్కాయి. 35 మంది అభ్యర్థులు ఉండగా మూడో స్థానం దక్కించుకోగలిగారు.



జీవీ సుందర్

ఆది నుంచి ఒక్కటే లక్ష్యం

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తులను ప్రకటించిన టీడీపీ అడుగడుగునా పక్కా ప్రణాళికతో విజయం కోసం ముందుకు సాగింది. టీడీపీ అధినేత చంద్రబాబు,పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఎప్పటికప్పుడు నేతలను అప్రమత్తం చేశారు. ఎన్నిక జరిగినన్ని రోజులు ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో పనిచేసేలా దిశానిర్దేశం చేశారు. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులకు ప్రత్యేక బాధ్యత అప్పగించి ఎమ్మెల్యేలందరిని సమన్వయం చేసే బాధ్యత అప్పగించారు. దీంతో నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ విజయం తమ విజయంగా భావించి క్యాడర్‌తో సమీక్షలు, ఎన్నికల ప్రచారం వరకు అంతా తామే అయి నడిపించారు.ఇలా ఎవరికివారు కూటమి అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చేలా కష్టపడ్డారు. పేరాబత్తుల విజయంతో టీడీపీ నేతలు మంగళవారం జిల్లాలో పలు చోట్ల సంబరాలు జరిపారు. కూటమికి భారీ విజయాన్ని కట్టబెట్టిన నేపథ్యంలో ఆనందోత్సవాల్లో మునిగితేలారు.

గ్రాడ్యుయేట్లు.. జై కొట్టారు!

ఉమ్మడి జిల్లాలోనూ ఏకపక్షంగా ఓటింగ్

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు కూటమికి పట్టం కట్టారు. కొన్ని నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన ఏకపక్ష విజయం తరహాలోనే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోను జైకొట్టారు. మొత్తం ఓటు హక్కు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్లలో 85శాతానికిపైగా కూటమి అభ్యర్థివైపే మొగ్గు చూపారు. దీంతో వైసీపీకి షాక్ తగిలింది. కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నుంచి అభ్యర్థిని నిలబెడితే మళ్లీ పరాభవం ఎదురవుతుందనే భయంతో ఆ పార్టీ వెనక్కు తగ్గింది. అదే సమయంలో టీడీపీ అభ్యర్థికి ప్రధాన పోటీ ఇచ్చిన మరో అభ్యర్థికి తెరవెనుక సహకారం అందించింది. కూటమి ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచే ప్రయత్నాలు చేసింది. ఎక్కడికక్కడ సోషల్ మీడియా గ్రూపుల్లోను కూటమిపై బురదజల్లే ప్రయత్నం చేసింది. కానీ ఎక్కడా గ్రాడ్యుయేట్ ఓటర్లు వీటిని వినిపించుకోలేదు. కూటమి అభ్యర్థికి ఏకపక్షంగా ఓటేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 36,361 మంది, మహిళలు 26,606 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పోలింగ్ రోజున 42,446 మంది 67.4 శాతం ఓటేశారు. కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లు ఉన్నారు. 47,125 మంది 73.09 శాతం ఓటేశారు. పురుషులు 27,450 మంది, మహిళలు 19,850 మంది, ఇతరులు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాకినాడ జిల్లాలో 70,540 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదవగా ఇందులో 42,463 మంది పురుషులు, 28,072 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో పోలింగ్ రోజు 47,150 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 29,232 మంది పురుష ఓటర్లు, 17,918 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెజార్టీ ఓట్లు కూటమి అభ్యర్థి పేరాబత్తులవైపే పడ్డాయి. మహిళా ఓటర్లయితే కూటమికి ఓట్లతో పట్టాభిషేకం చేశారు. కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోను కూటమి అభ్యర్థి పేరాబత్తుల అనుహ్య మెజార్టీతో ముందుకు సాగారు. విజయానికి కావలసిన ఓట్లను తొలి ప్రాధాన్యత ఓట్లతోనే సొంతం చేసుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే కూటమి అభ్యర్థికి జిల్లా ఏకపక్షంగా అండగా నిలిచింది.

బయట నుంచి పోరాడతా.. పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు

తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై మండలిలో పోరాటం చేయాలని కోరారు. అయితే తనకు అవకాశం ఇవ్వలేదని, అయినా బయట నుంచి నిరుద్యోగుల సమస్యలపై ఇక పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలైన పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ఫలితం వెలువడిన తర్వాత మీడియాతో అన్నారు. చాలా ఎక్కువ సంఖ్యలో చెల్లని ఓట్లు తేలడం, కొంత పట్టభద్రుల్లో తొట్రుపాటు, ఒత్తిడి, అవగాహనలేమి కారణం అయి ఉండవచ్చు. రానున్నకాలంలో ఓటుపై మరింత అవగాహన కల్పిస్తానన్నారు.





మిగిలిన అభ్యర్థులతో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ విజేత పేరాబత్తుల రాజశేఖరం.. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పేరాబత్తుల రాజశేఖరం చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, రామరాజు

చెల్లని ఓట్లు 19,694

పట్టభద్రులు చెల్లని ఓట్లు వేశారు.. ఒక్కటో రెండో కాదండోయ్.. ఏకంగా 19,694 ఓట్లు చెల్లుబాటు కాలేదు.. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. వీటిలో లెక్కించినది మాత్రం 1,99,208 ఓట్లే.



చంద్రబాబును నమ్మారు.. నన్ను గెలిపించారు

ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వం 8 నెలల్లో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులు నమ్మారు.. అందుకే తనను మెజార్టీతో గెలిపించి మండలికి పంపే అవకాశం ఇచ్చారని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. ఫలితం ప్రకటించిన వెంటనే మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను నమ్మి గెలిపించిన పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని, అందరికి అందుబాటులోకి ఉంటానన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చంద్రబాబు రాష్ట్రాన్ని బాగు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, తాను కూడా తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. కుటుంబ సభ్యులతో పేరాబత్తుల విజయాన్ని పంచుకున్నారు. అభిమానులు బాణసంచా పేల్చి హర్షం వ్యక్తంచేశారు.



పంచాయతీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

రెండు వారాల్లో రోడ్ల పక్కన చెత్త కనపడకూడదు : కలెక్టర్ ఆదేశం

అమలాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారం కనపడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఈవోపీఆర్డీలను ఆదేశించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. రెండు వారాల్లో చెత్త కనపడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలోని పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రోడ్ల మార్జిన్లలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడానికి రెండు వారాలు గడువు ఇస్తున్నట్టు తెలిపారు. గడువు అనంతరం చెత్త వేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛభారత్ మిషన్ పన్నుల రూపేణా వచ్చే ఆదాయాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు ఖర్చు చేయాలన్నారు. చెత్తాచెదారాలకు నిప్పు అంటించి కాల్చరాదని చెప్పారు. ఆరోగ్యపరమైన జీవన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీపీవో డి.శాంతలక్ష్మి, డీఎల్పీవో పి.బొజ్జిరాజు, దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు 9 గంటలు ఉచిత విద్యుత్ అందించాలి

శాసనసభలో ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ప్రస్తావించి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలని కోరారు. అలాగే రైతు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు హైవోల్టేజీకి గురై కాలిపోతున్నాయని, తద్వారా పంటలు పండించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే వారికి రాయితీపై విద్యుత్ మోటార్లను అందించాలని కోరారు. రైతులు వారు సాగు చేసే పంటలకు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి బండారు విజ్ఞప్తిచేశారు.



అమలాపురం చైతన్య కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్వో రాజకుమారి

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

796 మంది విద్యార్థుల గైర్హాజరు

అమలాపురం/అమలాపురంటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అన్నారు. అమలాపురం శ్రీచైతన్య, నారాయణ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలను ఆయా కేంద్రాల్లో పరిశీలించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. పరీక్షా పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి కేంద్రాలకు తరలింపులో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు డీఆర్వో సూచించారు. కాగా ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంగ్లీషు పేపరు-1 పరీక్షకు జిల్లావ్యాప్తంగా 796 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. జనరల్ విద్యార్థులు 11,654 మందికిగాను 11,228 మంది హాజరుకాగా 426 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌కు సంబంధించి 2805 మంది విద్యార్థులకు 2435మంది హాజరుకాగా 370 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని, రెండు ఫ్లయింగ్, మూడు సిటింగ్ స్క్వాడ్‌లు తనిఖీచేసినట్టు ఆయన తెలిపారు.



భౌ బోయ్!

ఏ వీధి చూసినా కుక్కల స్వైరవిహారం.. జనం గగ్గోలు

ఆస్పత్రికి రోజూ వందలాది మంది కుక్క కాటు బాధితులు

ఏబీసీ శస్త్ర చికిత్సలే శరణ్యం.. అవీ అరకొరే



(పిఠాపురం/ముమ్మిడివరం/మలికిపురం/అంతర్వేది/ఆత్రేయపురం/కపిలేశ్వరపురం/గండేపల్లి/ఏలేశ్వరం/కొవ్వూరు-ఆంధ్రజ్యోతి)

ఏ వీధి చూసినా కుక్కల స్వైరవిహార దృశ్యాలే. అటు వైపు వెళ్లిన వారిని చూసి మొరగడమో, లేదా ఒక్కసారిగా మీదపడి దాడి చేయడమో నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల మీద పడి కుక్కలు దాడి చేస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కడ నుంచి ఏ కుక్క వచ్చి మీద పడి కాటు కరుస్తుందో తెలియదు. రాత్రి వేళల్లో అయితే మరీ దారుణం. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మీదకు వచ్చేందుకే సాహసించడం లేదు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. ఇటీవల చిన్న పిల్లలపై దాడి చేసి మరీ కరుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కుక్కల బెడదపై జనం గగ్గోలు పెడుతున్నారు. కుక్కకాటుకు గురై ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీలకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్ని నియంత్రణ చర్యలు చేపట్టినా చట్టపరంగా ఉన్న ఇబ్బందులతో అధికారులు ముందడుగు వేయలేకపోతున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి ప్రతీ రోజూ సగటున 15-35 మంది కుక్కకాటుకు గురై చికిత్స నిమిత్తం వస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో విదితమవుతుంది. పిఠాపురమే కాదు పీహెచ్‌సీలకు వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య కూడా అన్నిచోట్లా అధికంగానే ఉంటోంది. వాస్తవానికి కుక్కకాటుకు గురైన వ్యక్తికి ఐదు డోసుల ఏఆర్‌వీ వ్యాక్సిన్ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్ ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోవాలంటే రెండు వేల రూపాయల వరకూ వ్యయం అవుతుంది. అన్ని ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉండడంతో కొంత ప్రజలకు ప్రయోజనకరంగా ఉంది.

జంతువులనూ వదలడం లేదు..

ఇక పిచ్చికుక్కలతో జనం భయభ్రాంతులవుతున్నారు. అవి మనుషులతోపాటు జంతువులనూ వదలడం లేదు. మేకలు, కోళ్లు, గొర్రెలు, పశువులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. వీటిలో తీవ్రంగా గాయపడిన జంతువులు మృత్యువాత పడుతున్నాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చినజగ్గంపేట, దుర్గాడ, పిఠాపురం మండలం విరవ, విరవాడ, కోలంక తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా జరిగిన కుక్కలదాడిలో పలు గొర్రెలు, మేకలు, దూడలు మృత్యువాతపడ్డాయి. ఇటు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో ఏ వీధిలో చూసిన కుక్కలు సైర్వ విహారం చేస్తున్నాయి. దీనిపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో 377 కుక్కలను గుర్తించామని, వాటికి శస్త్రచికిత్సలు చేయించడానికి చర్యలు చేపట్టామన్నారు.

నియంత్రణలో అన్నీ ఇబ్బందులే..

కుక్కలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చట్టపరంగా ఉన్న ఇబ్బందులు అధికారులను ముందుకు కదలనివ్వడం లేదు. కుక్కలను గతంలో గ్రామపంచాయతీలు, పురపాలకసంఘాల ఆధ్వర్యంలో పట్టుకుని సంహరించేవారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థలు చర్యలు చేపట్టడంతో ఇబ్బందులు ఉండేది కాదు. జంతుప్రేమికులు కోర్టును ఆశ్రయించడంతో వాటిని చంపడానికి వీలులేదు. దీంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. 2023లో అమలులోకి వచ్చి జంతు నియంత్రణ నిబంధనల ప్రకారం శునకాల సంఖ్య పెరగకుండా ఉండేందుకు సంతానోత్పత్తి నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇందుకు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న అన్ని కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించాల్సి ఉంటుంది. అదే సమయంలో అవి కరిచినా రేబిస్ వ్యాధి వ్యాపించకుండా ఉండేందుకు వాటికి రేబిస్ వాక్సినేషన్ చేయాలి. ఈ బాధ్యత స్థానిక సంస్థలపై ఉంది. ఒక్కో శునకానికి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసి వాక్సినేషన్ చేయించేందుకు రూ.1700 వరకు వ్యయం అవుతుంది. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో 600 నుంచి 800 కుక్కలు ఉంటాయని అంచనా. వీటికి కు.ని. చికిత్స, వ్యాక్సినేషన్ చేసే ప్రక్రియను ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. అది మొదలు కావాల్సి ఉంది. కుక్కల సంతానోత్పత్తి నియంత్రణపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ కుక్కల నియంత్రణకు యాంటీ బర్త్‌కంట్రోల్ ఆపరేషన్, యాంటీరేబిస్ వ్యాక్సిన్ వంటి వాటిని వేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసినట్టు చెప్పారు. ఇక అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో కుక్కలకు యాంటీ బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ నిర్వహించేందుకు థియేటర్ నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కుక్కల నియంత్రణకు సంబంధించి కాకినాడలోని స్వచ్ఛంద సంస్థను సంప్రదిస్తున్నారు. ఈ ఆపరేషన్ల కోసం ఒక్కో కుక్కకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఆపరేషన్ చేస్తున్న కుక్కను ఏడు రోజుల పాటు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వేసవి ప్రవేశించడం, ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సాధారణ సమయాల్లో కంటే ఇప్పుడు కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య ఏటా పెరుగుతుంది. వేడి వాతావరణంతో వాటికి చెమట పట్టక ఎండతీవ్రత తట్టుకోలేక కుక్కలు విచక్షణారహితంగా మీద పడి కరుస్తాయని పశు వైద్యులు చెబుతున్నారు. దీంతో రోడ్లపై తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వ్యాక్సినేషన్‌తోపాటు గ్రామాలు, పట్టణాల్లో కుక్కల నియంత్రణపై అధికార యంత్రాంగంతోపాటు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇవీ సంఘటనలు..

- ఫిబ్రవరి 17వ తేదీ సాయంత్రం పిఠాపురం పట్టణంలోని మంగాయమ్మరావుపేట, చిట్టోడితోట తదితర ప్రాంతాల్లో వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులతోపాటు పాఠశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, రహదారిపై వెళ్లే వారిపై పిచ్చికుక్క దాడి చేసి కరవడంతో 20 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరిని తొడపై, చేతులు, ముఖంపై కరవడంతో ఏఆర్‌వీతోపాటు ఖరీదైన మరో ఇంజక్షన్‌ను చేశారు.
- నెలన్నర కిందట గొల్లప్రోలు పట్టణంలోని పలు వీధుల్లో పిచ్చికుక్క కరవడంతో 15 మందికి గాయాలయ్యాయి. వీరికి గొల్లప్రోలు పీహెచ్‌సీ, పిఠాపురం ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందించారు.
- కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో మండలంలో 86 కుక్కకాటు కేసులు నమోదైనట్టు సమాచారం.
- మలికిపురం మండల పరిధిలో జనవరి నెలలో తూర్పుపాలెంలో ఏడుగురిని పిచ్చికుక్క కరవగా రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. లేగ దూడలపై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇదే మండలంలో లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భావనను తెలిపిన వివరాల ప్రకారం నెలకు 50 మంది కుక్కకాటుకు గురవుతున్నారు. ఫిబ్రవరిలో 48 మందిని కుక్కలు కరవగా వ్యాక్సిన్ వేశారు.
- సఖినేటిపల్లి మండలంలో గత రెండు నెలలుగా సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీల్లో 167 మంది కుక్కకాటుకు గురై టీకాలు వేయించుకున్నట్టు పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. అంతర్వేది, మోరి, సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది, టేకిశెట్టిపాలెం, లంక ప్రాంతాల్లోని చాలామంది ప్రజలు కుక్కకాటుకు గురై ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- ఫిబ్రవరిలో ముమ్మిడివరం హైస్కూలు రోడ్డులో తొమ్మిదిమందిపై కుక్క దాడిచేసి గాయపరిచింది. జనవరిలో కొత్తలంక గ్రామంలో కుక్కల దాడికి ఆరుగురు తీవ్రగాయాలపాలయ్యారు. ముమ్మిడివరం బైపాస్‌రోడ్డులో కుక్కలు పశువులపై దాడిచేసి గాయపరిచాయి.
- కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఈనెల 2వ తేదీన పిచ్చికుక్క దాడి చేసి 15 మందిని గాయపరిచింది. వీరిలో తీవ్రంగా గాయపడిన పదేళ్ల బాలుడు మణికంఠ, రెండేళ్ల చిన్నారి కార్తికేయ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకుంటున్నారని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు శైలజ తెలిపారు.
- ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ఇటీవల ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరుగురిని గాయపరిచింది. ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామివారి క్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ సమీపంలోనే కుక్కల బెడదతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.
- కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. అంగర, కపిలేశ్వరపురం, టేకి, మాచర, కోరుమిల్లి, వెదురుమూడి, వల్లూరు తదితర గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాలు ఏటిగట్టును అనుకుని ఉండడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చి ఇక్కడ వదలడంతో అవి గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు. కుక్కల సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చట్టరీత్యా కుక్కలను చంపేందుకు వీలు లేకపోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితి. వేరే చోటకి తీసుకెళ్లి వాటిని వదులుదామన్నా ఆ ప్రాంత జనం ఒప్పుకునే పరిస్థితి లేదని పలువురు తెలిపారు.

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 5 వేల కుక్కలు

660 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో కుక్కల బెడద మామూలుగా లేదు. రాత్రి వేళ ఏ రోడ్డులోకి వెళ్లినా మీద పడే స్థాయిలో కుక్కలు అలజడి సృష్టిస్తున్నాయి. స్మార్ట్ సిటీగా ఉన్న కాకినాడలో ఈ కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కకాటు బాధితులు నిత్యం పెద్దసంఖ్యలో ఆసుపత్రులకు వెళుతున్నారు. కాకినాడ నగరంలో సర్వే ప్రకారం గుర్తించిన ఐదువేల కుక్కల్లో ఇప్పటికే 660 కుక్కలకు యాంటీ యానిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం కింద ఆపరేషన్లు చేశామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్ తెలిపారు. మిగిలిన కుక్కలకు ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కుక్కలపై వచ్చే ఫిర్యాదుల మేరకు తమ సిబ్బంది వాటిని పట్టుకుని ఏబీసీ సెంటర్లో పరీక్షలు నిర్వహించి, రేబిస్ లేని కుక్కలను ఆయా ప్రాంతాల్లో విడిచిపెడతామన్నారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లిలో గుంపులుగుంపులుగా శునకాలు

● ఏబీసీ పనిచేస్తోందా...

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్స్‌ని చేస్తుంటారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు. దీనికి ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చు చేస్తోంది. ఇప్పుడు ఒకే ఆపరేషన్ థియేటర్ ఉండగా రెండు కుక్కలకు ఒకేసారి చేసే సదుపాయం ఉంది. ఈ నెలలోనే మరో థియేటర్ నిర్మించి ఆ ఏబీసీ సంఖ్యను రోజుకు 50కి పెంచే ఆలోచన చేస్తున్నారు. కరోనా సమయంలో 2019-2022 మధ్య ఏబీసీ ఆపేశారు. దాంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని అంచనా. అయితే 2023, 2024ల్లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగకపోవడమే ఇప్పుడు జనం ప్రాణాల మీదకు తెస్తుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక రోజులో పట్టుకున్న అన్ని కుక్కలకు ఆపరేషన్ చేయడం వీలుపడకపోవచ్చు. కుక్క నూడిదికావడం, ట్యూమర్లు ఉండడం, సర్జరీకి సహకరించకపోవడం కారణాల వల్ల ఏబీసీ చేయకుండా వదిలేయాల్సి రావచ్చు. పైగా ఎక్కడ నుంచి తీసుకెళ్లారో వాటిని అక్కడే వదిలేయాలి.

● వెటర్నరీ ఎక్కడ?

రాజమహేంద్రవరం డివిజన్లో 10, కొవ్వూరు డివిజన్లో 9 వెటర్నరీ ఆస్పత్రులున్నాయి. ఇవి మండల కేంద్రాల్లో ఉంటాయి. వీటిలో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. మండలానికి 3-4 వెటర్నరీ డిస్పెన్సరీలు ఉన్నా సర్జరీలకు అవసరమైన సామగ్రి ఉండదు. అయితే ఎక్కడా కూడా కుక్కల ఏబీసీపై దృష్టి సారిస్తున్నట్టు లేదు. కేవలం రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏబీసీలు చేయడంతో పెద్దగా ఉపయోగం ఉండడం లేదనే వాదన వినవస్తోంది. వెటర్నరీ శాఖ పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఏరియాల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. కొద్దివారాలపాటు కొనసాగించి తర్వాత నిలిపివేశారు. ముఖ్యంగా వాటిని తీసుకొచ్చి సర్జరీ తర్వాత తీసుకెళ్లి వదిలే ఏర్పాటు లేదని వెటర్నరీ అధికారులు చెబుతున్నారు. ఇది కూడా శునకాల సంతతి పెంపుదలకు దోహదం చేస్తోందనే విమర్శలు వినవస్తున్నాయి.

- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి

పదిరోజుల్లో 292 కుక్కకాటు కేసులు



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలోని క్లినిక్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కుక్కకాటు బాధితులు ప్రతిరోజూ రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి క్యూ కడుతున్నారు. బోధనాసుపత్రి క్యాజువాలిటీ విభాగం సమీపంలోని యానిమల్ బైట్ క్లినిక్‌కు ప్రతిరోజూ బాధితులు వస్తున్నారు. గత పదిరోజుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 292 మంది కుక్కకాటు బాధితులు ప్రభుత్వాసుపత్రిలో ఏఆర్‌వీ ఇంజక్షన్లు (వ్యాక్సిన్లు) చేయించుకోవడం గమనార్హం. ఇవన్నీ కొత్త కేసులు. వీరిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా ఉంటున్నారు. ఏఆర్‌వీ డోసులు నెలలో నాలుగుసార్లు వేయాల్సి ఉంటుంది. కొత్త కేసులు ప్రతిరోజూ 30 నుంచి 35 వరకూ ఉంటున్నాయని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. పాత వాటితో కలుపుకుంటే కేసులు 70 నుంచి 80 వరకూ ఉంటున్నాయి. కుక్క కరచిన గాయాలు ఎక్కువగా ఉంటే రిగ్ అనే మరో ఇంజక్షన్ కూడా ఇస్తున్నారు. దీన్ని కుక్క కరచిన 24 గంటల్లోగా చేయించుకోవాల్సి ఉంది. దీన్ని ఒకే డోసుగా వేస్తారు.

నెలాఖరుకు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలి



- పట్టణాల్లో కుక్కల నియంత్రణకు నేహా ఏజెన్సీస్ సహకారం
- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు
- తూర్పు, కోనసీమ జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

నిడదవోలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతి మున్సిపాలిటీలోను పన్నుల వసూళ్లను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని, వాటిని వేగవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘాల పరిధిలో ప్రజలు ఆస్తి, నీటి పన్నులను త్వరగా చెల్లిస్తే అవి పట్టణాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. మున్సిపాలిటీల్లో ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కుక్కల సంతానోత్పత్తిని నివారించేందుకు నేహా ఏజెన్సీస్ ముందుకు వచ్చిందని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి కుక్కల సంతానోత్పత్తి పెరగకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రతి కమిషనర్లు తమ పరిధిలోని అన్న క్యాంటీన్లలో భోజన సదుపాయం, మంచినీరు పరిశుభ్రతకు ప్రాముఖ్యతనిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పురపాలక సంఘాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార్లను ఆదేశించామన్నారు. రోజూ ఉదయం కమిషనర్, శానిటేషన్ సిబ్బంది వార్డుల్లో పర్యటించి ఫొటోలు అప్‌లోడ్ చేసేలా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. తొలుత ఆర్డీ మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కంపోస్టు యార్డు, పంప్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్లు టి.కృష్ణవేణి, టి.నాగేంద్రకుమార్, కేవీఆర్.రాజు, టీవీ రంగారావు, పి.రవివర్మ, ఐవీ నాయుడు పాల్గొన్నారు.



జర్మనీ ఎయిర్‌పోర్ట్‌లో మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న తెలుగు ప్రజలు, జనసైనికులు

జర్మనీ పర్యటనకు మంత్రి దుర్గేష్

నిడదవోలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్లో జరుగుతున్న ఐటీబీ బెర్లిన్-2025 సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పాల్గొనేందుకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున ఆయనకు ఎన్‌ఆర్‌ఐలు, జనసైనికులు ఘనస్వాగతం పలికారు.



శిక్షణ పొందుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు





అకస్మాత్తుగా ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే చర్యలను తెలియజేస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విపత్తుల వేళ.... రక్షిస్తామిలా!

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ ట్రైనింగ్





సర్పవరం జంక్షన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, విపత్తుల సమయంలో ప్రజల ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలను వెలకట్టలేమని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు అన్నారు. కాకినాడ జిల్లా కాకినాడరూరల్‌లోని రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో రెండువారాలుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ ట్రైనింగ్ (డీఆర్‌ఈటీ) ఇచ్చారు. మంగళవారం జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో వినియోగించి స్కిల్స్ పెంచుకోవాలన్నారు. విధులు, ఫిట్‌నెస్, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆవశ్యకత, ప్రమాదాలు, విపత్తుల సమయంలో అనుసరించాల్సిన విధానాలను సిబ్బందికి అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందనరావు వివరించారు. అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ స్టోర్, స్టాల్‌ని పరిశీలించారు. అధునాతన పరికరాలను చూసి పరీక్షించారు. అసిస్టెంట్ కమాండెంట్లు ఎం.మోహనరావు, బి.చంద్రశేఖర్, వి.రాము, ఆర్‌ఐ, ఎస్‌డీఆర్‌ఎఫ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గ్రూప్ ఫొటో

పక్షుల రెట్టలకూ కుర్చీలు!



రైల్వేస్టేషన్‌లో చెట్ల కింద పక్షుల రెట్టలతో అపరిశుభ్రంగా ఉన్న కుర్చీలు

ఆశ్చర్యపోకండి! విస్మయం చెందకండి!! మీరు చదివిన శీర్షిక కరెక్టే. ఈ ఫొటోను చూస్తుంటే విషయం మీకు అర్థమయ్యే ఉంటుంది. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లో త్వరలో దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీలు ఉండడంతో పలు పనులను చురుగ్గా చేస్తున్నారు. పనికిరానివి, పనికొచ్చేవీ కూడా పక్కన పడేస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులు కూర్చోవడానికి వినియోగించిన ఐరన్ కుర్చీలను తొలగించి స్టీలు కుర్చీలను ఎడాపెడా ఏర్పాటు చేశారు. తొలగించిన కుర్చీలను ఇలా చెట్టు కింద పడేయగా... పక్షులు రెట్టలు వేయడానికి వినియోగించుకుంటున్నాయి మరి!. స్వచ్ఛ భారత్‌ని పక్కనపెడితే... అసలు ఈ ప్రదేశం ఎప్పుడూ పక్షుల రెట్టలతో దుర్వాసన, దరిద్రంగా ఉంటుంది. ఇప్పుడు ఈ కుర్చీలు ఆ అపరిశుభ్రతను మరింత రెట్టింపు చేశాయి. రోజుకు 25వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్లో.. అదీ రద్దీగా ఉండే ఒకటో ప్లాట్‌ఫామ్‌పై ఇదండీ సంగతి!!

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో చిందరవందరగా మూలనపడ్డ కుర్చీలు

30 గంటలు

సుదీర్ఘంగా ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్

30 గంటల తర్వాత ఫలితం ప్రకటన

ముగిసిన ఎన్నికల కోడ్

ఏలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజక వర్గ ఓట్ల లెక్కింపు కార్యక్రమం సుదీర్ఘంగానే కొనసాగింది. సోమవారం ఉదయం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గెలిచిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఎన్నిక ధృవీకరణ పత్రం ఆర్వో కె.వెట్రిసెల్వి అందజేతతో ముగిసింది. 456 పోలింగ్ కేంద్రాల వారీగా స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకువచ్చి, వాటిని కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 28 టేబుల్స్‌పై వేసి కట్టలు కట్టే కార్యక్రమం ఏకబిగిన 12 గంటల పాటు సాగింది. ఉద్యోగ సిబ్బంది మూడు షిఫ్టుల్లో ఈ ప్రక్రియను చేపట్టారు. కట్టలు కట్టే కార్యక్రమం అన్ని టేబుల్స్‌పై ఒకే రీతిన సాగలేదు. దీంతో రౌండ్ రౌండ్‌కు అంతరం పెరిగి ఆలస్యం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓట్లను 50 చొప్పున విభజించి కట్టలు కట్టే పనే సాగింది. అనంతరం 8.30 గంటలకు ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ ప్రారంభం అయింది. అయితే ఓట్ల లెక్కింపులో అంకెలు, సరైన ఓట్లనే చెల్లనిగా ప్రకటించారంటూ ఏజెంట్లు పదేపదే అభ్యంతరాలు చెప్పడంతో తొలి రౌండ్ ఫలితం ఆలస్యంగా రాత్రి 12.30 గంటలకు విడుదల చేశారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కూడా ప్రతీ ఓటును ఏజెంట్‌కు క్షుణంగా చూపించాల్సి రావడంతోనే జాప్యం చోటు చేసుకుంది. రాత్రి 3 గంటలకు రెండో రౌండ్ ఫలితం రాగా, 5 గంట లకు మూడో రౌండ్, 7 గంటలకు నాలుగో రౌండ్, 9 గంటలకు ఐదో రౌండ్, 11 గంటలకు ఆరో రౌండ్, మధ్యాహ్నం 1 గంట దాటాక 6 రౌండ్ ఫలితం విడుదలయ్యింది. ఇక్కడే పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖరారైంది. చివరగా కొన్ని టేబుల్స్‌పైన ఓట్ల లెక్కింపును మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేశారు.



ఓట్ల స్లిప్పులను కట్టలుగా కడుతున్న కౌంటింగ్ సిబ్బంది

అధికారులకు అభినందనలు

ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ అధికారులు అద్భుతంగా పనిచేశారని, అత్యంత నైపుణ్యంతో శాంతి యుతంగా చేయడం అభినందనీయమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి అన్నారు. ఆరు జిల్లాల యంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని, పోలీస్ యంత్రాంగం బాగా పనిచేసిందన్నారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు సజావుగా, ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల నిర్వహణ జరిగిన ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం ఉత్తర్వులు సాయంత్రం జారీ చేశారు. ఇక వివిధ విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగిపోనున్నాయి. అధికారిక కార్యక్రమాలు, పర్యటనలు సాగుతాయి. కౌంటింగ్ ప్రక్రియతో సోమవారం మూతపడిన మద్యం దుకాణాలు, బార్‌లు కూడా సాయంత్రం సీళ్లను తొలగించడంతో యధావిధిగా పనిచేశాయి.



ఎన్నికలు సక్సెస్ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు

ఈతకొడుతూ తిరిగిరాని లోకాలకు..

రాజస్థాన్‌లో బీటెక్ విద్యార్థి దుర్మరణం

స్వగ్రామం గొర్రిపూడిలో అంత్యక్రియలు



సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

కరప, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి గండి సత్యనారాయణ (18) ఆదివారం ఉదయం రాజస్థాన్ రాష్ట్రం పిచోల జిల్లా ఉదయ్‌పూర్ సిటీలోని ఒక చెరువులో ఈతకొడుతూ ప్రమాదవశాత్తు దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి శివకుమార్, బంధువులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణ ఉదయ్‌పూర్‌లోని సర్ పదంపత్ సింఘానియా యూనివర్శిటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. 2వేల మందితో నిర్వహించిన 10కేఎమ్ మారథాన్‌లో పాల్గొని 21వ స్థానంలో నిలిచిన సత్యనారాయణ ఆదివారం ఉదయం జరిగిన 5కేఎమ్ వాక్‌థాన్‌లోనూ పాల్గొన్నాడు. అనంతరం హాస్టల్ వార్డెన్ అనుమతితో రాజమహేంద్రవరం, రాజస్థాన్‌లకు చెందిన ఇద్దరు మిత్రులతో కలిసి సత్యనారాయణ సైట్ సీయింగ్‌కు వెళ్లాడు. పిచోల చెరువులో ఈతకు దిగి రెండు రౌండ్లు ఈతకొట్టిన సత్యనారాయణ ఒడ్డున ఉన్న మిత్రులకు చెయ్యి ఊపి మళ్లీ మూడో రౌండుకు వెళ్లాడు. అయితే ఎంతకీ అతడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన మిత్రులు అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్‌ను అప్రమత్తం చేశారు. అరగంట తరువాత చెరువు లోతులోని దట్టంగా ఊడల మాదిరి పెరిగిపోయిన నాచులో చిక్కుకుని అపస్మారకస్థితిలో ఉన్న సత్యనారాయణను ఒడ్డుకు తీసుకువచ్చి సీపీఆర్ చేశారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. సత్యనారాయణకు ఈత బాగా వచ్చని, అయితే అత డు ధరించిన ట్రాక్ నీటికి బరువెక్కడంతో పా టు నాచులో చిక్కుకపోవడంతోనే మృతిచెందినట్టు అక్కడి పోలీసులు నిర్ధారరణకు వచ్చారు. సత్యనారాయణ మృతిచెందిన విషయం తెలుసుకుని అతడి తల్లిదండ్రులు కుప్పకూలిపోయా రు. మృతుడు సత్యనారాయణ, అతడి సోదరుడు కార్తికేయకు రైఫిల్ షూటింగ్‌లో మంచి ప్రావిణ్యం ఉంది. 2023 జనవరిలో ఆగ్రాలో జరిగిన జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్‌లో వారిద్దరూ బంగారు పతకాలను సాధించి సత్తా చాటారు. పోస్టుమార్టమ్, ఇతర లాంఛనాలు పూర్తిచేసిన పిదప మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని కార్గో ఫ్లైట్‌లో వైజాగ్ తరలించి అక్కడ నుంచి మంగళవారం రాత్రి స్వగ్రామం గొర్రిపూడి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలివిడిగా ఉంటూ క్రీడలు, చదువులో ముందుండే సత్యనారాయణ అర్థంతరంగా తనువు చాలించడంతో గొర్రిపూడి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చోరీకి పాల్పడ్డ మహిళ అరెస్టు

బంగారు ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో తోటి ప్రయాణికురాలిగా ఉండి చోరీకి పాల్పడిన మహిళను అరెస్టు చేసి 117 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. గుంటూరు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన ఆవుల యశోద (32)ను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గత నెల 17న విశాఖ జిల్లా కూర్మనపాలేనికి చెందిన దుర్గమ రామకృష్ణ భార్యతో కలిసి కాకినాడ ఆర్టీసీ బస్టాండులో అమలాపురం నాన్‌స్టాప్ బస్ ఎక్కారు. రామకృష్ణ భార్య పక్క ఒక మహిళ కూర్చోగా ఆమె పక్కనే సూట్ కేస్ పెట్టుకున్నారు. ఆ మహిళ ముమ్మిడివరంలో బస్ దిగిపోయింది. అమలాపురం బంధువుల ఇంటికి వచ్చిన రామకృష్ణ సూట్‌కేస్ తెరచి చూడగా 117 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించి వెంటనే అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వీరబాబుతో పాటు క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ నేతృత్వంలో పట్టణ ఎస్ఐ ఎస్ఆర్ కిశోర్‌బాబు, క్రైమ్ సిబ్బంది కేసును ఛేదించి ఆభరణాలను స్వాధీనం చేసుకోగా డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో పాటు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. చోరీకి పాల్పడిన యశోదను అమలాపురం కోర్టులో హాజరు పరచనున్నట్టు సీఐ తెలిపారు.

'ఉద్యోగాలివ్వకుంటే ఓఎన్జీసీ పనులు అడ్డుకుంటాం'

అల్లవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్ పరిధిలో చమురు నిక్షేపాల ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్న అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఓఎన్జీసీ కార్యకలాపాలను అడ్డుకుని ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద రెండో రోజు మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు ఆందోళన కొనసాగించారు. ఓడలరేవు గ్రామంలో అర్హులైన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ నిరవధిక ఆందోళనకు దిగారు. ఓఎన్జీసీ టెర్మినల్‌లో ప్రధాన టాటా కంపెనీతో పాటు ప్రమోటెక్ కంపెనీ స్థానికుల ఉద్యోగాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, టీడీపీ నాయకులు కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, గండుమేను శ్రీనివాస్, మంతెన సురేష్‌రాజు, పెమ్మాడి వెంకటరామారావు, మందపాటి రామకృష్ణ, రేకాడి శేషగిరి, జనసేన నాయకులు గుత్తం కృష్ణ, పిండి గణపయ్య, నల్లా రాము, కటికిరెడ్డి బాబి ఓఎన్జీసీ సైట్ వద్ద ఆందోళన చేశారు.

రూ.27 అదనపు వసూలుకు రూ.27 లక్షల భారీ జరిమానా

కాకినాడ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ కన్నా అదనంగా రూ.27 వసూలు చేసినందుకు కాకినాడ వినియోగదారుల కమిషన్ రూ.27 లక్షలు భారీ జరిమానా వడ్డించింది. కమిషన్ బెంచ్ తరపున అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంతకుమార్, చక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ విధంగా తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లికి చెందిన నున్న కుసుమ కళ్యాణ్ 2023, డిసెంబరు 8న హైదరాబాద్ బోడుప్పల్‌లో ఉన్న ట్యూలిప్స్ గ్రాండ్ హోటల్‌లో బిర్యానీలు, డ్రింకులు, మూడు మినరల్ వాటర్ బాటిల్స్ కలిపి రూ.3,083 జొమాటో డైనింగ్ పే ద్వారా చెల్లించి కొనుగోలు చేశారు. హోటల్ యాజమాన్యం రూ.20 ఎమ్మార్పీ గల వాటర్ బాటిల్‌ను ఒక్కొక్కటి రూ.29కి విక్రయించింది. మూడింటికి రూ.60కి బదులు రూ.87 వసూలు చేయడాన్ని కళ్యాణ్ గుర్తించి హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో బాధితుడు తన న్యాయవాదిద్వారా నోటీసులు పంపినా హోటల్ యాజమాన్యం స్పందించకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అనంతరం కమిషన్ వారి సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని హోటల్ ట్యూలిప్స్ గ్రాండ్ నిర్వాహకులు దాహం తీర్చుకునే నీళ్ల బాటిల్‌పై వినియోగదారుడిపై అదనంగా రూ.9 భారం వేయడం అనైతికమని నిర్ణయించింది. ఈ రకంగా సమాజంలో వినియోగదారులను అన్యాయంగా దోచుకోవడం పరిపాటి అయినందున బాధితుడు కళ్యాణ్‌కు హోటల్ యాజమాన్యం రూ.25వేల నష్టపరిహారం, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.2వేలు చెల్లించడంతోపాటు తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.27లక్షల భారీ జరిమానా చెల్లించాలని కమిషన్ తీర్పు ఇచ్చింది.

కాకినాడలో భారీ పేలుడు

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

కాకినాడ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జగన్నాధపురం, జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సోమవారం జరిగిన భారీ పేలుడు సంఘటనలో గాయాలపాలైన క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స కొనసాగుతుంది. అయితే మంగళవారం మంగళగిరి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టి పలు నమూనాలను సేకరించింది. ఆ నివేదిక ఆధారంగా పోలీస్‌శాఖ తదుపరి చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివక్షత లేని సమాజం వైపు అడుగులు

● 'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ● ఘనంగా ప్రారంభమైన నారీఫెస్ట్



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ



ఫ్యాషన్ షోలో పాల్గొన్న విశ్వవిద్యాలయం విద్యార్థులు

దివాన్‌చెరువు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు గతంలో ఎన్నో వివక్షతలను ఎదుర్కొనేవారని, నేటి సమాజంలో కొంత మార్పు వచ్చిందని, భవిష్యత్‌లో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం తూర్పుగోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో నారీఫెస్ట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆకాశంలో సగం, అవకాశంలో సగం మాత్రమే కాకుండా ఆదరించడంలో కుడా సగం కావాలన్నారు. మహిళలు ఆదరణను కోరుకుంటారని, ఆ ఆదరణ తల్లిదండ్రులు, జీవితభాగస్వామి, పిల్లలు, గురువులు, స్నేహితులు, సన్నిహితుల నుంచి లభిస్తుందన్నారు. మనిషికి ఎన్ని డిగ్రీలు ఉన్నా ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆదరణ, మానవవిలువలు లేకపోతే వృథా అన్నారు. విశ్వవిద్యాలయంలో మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామన్నారు. బంధంతోబాటు సంస్కృతీ సంప్రదాయాలు మామ్మతరం నుంచి మనవరాలు తరం వరకూ కొనసాగాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పెద్దవారిని ఎప్పటికీ గౌరవించాలని అనాథ ఆశ్రమాలు లేని సమాజం వైపు పయనించాలని సూచించారు. వివిధ కేటగిరిలకు చెందిన మహిళలు, బాలలను వేదికపైకి పిలిచి బుడగలు వదిలి పోటీలు ప్రారంభించారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలు, స్థానిక మహిళలు హాజరయ్యారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం మహిళాసెల్ కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరీదేవి, అధ్యాపకులు వి.పెర్సిస్, ఎన్.సజనరాజ్, కె.దీప్తి, డి.లత, బి.వి జయకుమారి, ప్రత్యేక సలహా కమిటీ సభ్యులు డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, కె.నూకరత్నం, పద్మావతి,కె.రమణేశ్వరి ఉన్నారు.

'సూర్యఘర్'పై విస్తృత ప్రచారం నిర్వహించాలి

సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్



అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో లైన్‌మెన్ దివస్ కార్యక్రమంలో పలువురిని సత్కరించిన సీఎండీ పృథ్వితేజ్

అమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు చౌకగా సోలార్ విద్యుత్‌ను అందించే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వితేజ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కోనసీమ జిల్లా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు, వసూళ్లపై సమీక్షించారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు కేంద్రం అందిస్తున్న రాయితీపై అవగాహన కల్పించడం ద్వారా సోలార్‌విద్యుత్ వాడకాన్ని పెంపొందించి ప్రజలకు తక్కువ ధరకు విద్యుత్ అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా వేసవి సీజన్‌లో ఎక్కడా లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయితే గుర్తించి అందుకు తగిన యాక్షన్ ప్లాన్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సర్కిల్ పనితీరును సమీక్షించారు. తొలుత ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలోని ఆపరేషన్ సర్కిల్‌లో లైన్‌మెన్స్ దివస్‌ను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పృథ్వితేజ్ పాల్గొన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ ఎస్.నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.రాంబాబు, కె.రత్నాలరాజు, సీనియర్ అక్కౌంట్ ఆఫీసర్ కె.సత్యకిశోర్, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

గణేష్‌కు దివాస్ అవార్డు

చింతూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కణితి గణేష్ లైన్‌మెన్ దివాస్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖ సర్కిల్ చింతూరు సబ్‌స్టేషన్ పరిధిలో గణేష్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) లైన్‌మెన్ దివాస్ అవార్డులను ప్రకటించింది. నిబద్ధత, త్యాగం, సేవా గుణాలను ప్రదర్శించిన విద్యుత్ ఉద్యోగులకు ఈ అవార్డులను అందజేస్తుంటుంది. ఇందులోభాగంగా మంగళవారం సీఈఏ నేతృత్వంలో ఎంపికైన ఉద్యోగులకు ఢిల్లీలో అవార్డులు అందించి సన్మానించారు. ఈ క్రమంలో గణేష్ లైన్‌మెన్ దివాస్ అవార్డుతోపాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన అవార్డును కూడా దక్కించుకున్నారు. వరదల సమయంలో సాధ్యా సాధ్యాలను పరిగణనలోకి తీసుకొని వినియోగ దారులకు విద్యుత్ సరఫరా అందించడంలో గణేష్ సాహసంతో కూడిన ప్రతిభను కనబర్చి నందునే అవార్డుకు ఎంపికయ్యారు. సీఎండీ, ఎస్ఈ, డీఈ, ఏడీఈలతో పాటు చింతూరు వాసులు గణేష్‌కు అభినందనలు తెలిపారు.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కణితి గణేష్

అక్రమ మద్యం ధ్వంసం



రోడ్డు రోలర్‌తో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం సబ్ డివిజన్‌లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.15 లక్షలు విలువైన అక్రమ మద్యాన్ని మంగళవారం ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు, డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో ద్రాక్షారామ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మంగళవారం డీపీఎల్ 351 లీటర్లు, ఎన్ డీపీఎల్ 511.85 లీటర్లు, ఐడీఎల్ 1809 లీటర్లు వెరసి 446 కేసులు, 2672 బాటిల్స్‌ను రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో మండపేట సీఐ దొరరాజు, రామచంద్రపురం ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు, ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్, కె.గంగవరం ఎస్ఐ జానీబాషా, మండపేట ఎస్ఐ సురేష్‌బాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పి, అడవి పంది మాంసం అమ్మకాలు

అల్లవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో లభ్యమయ్యే దుప్పి(జింక) మాంసం, అడవి పంది మాంసాలు కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరి మార్కెట్‌లో వారానికి ఒకరోజు బహిరంగంగా విక్రయిస్తున్నారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి మాంసాలను తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ అమ్మకాలను అటవీశాఖ, పోలీసుశాఖలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

ఎక్సైజ్ అధికారుల సమక్షంలో షాపు సీజ్, ముగ్గురిపై కేసు



పలివెలలో మద్యం షాపు సీజ్ చేస్తున్న అధికారులు

కొత్తపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల మారుతీ వైన్స్ వద్ద మంగళవారం ఎక్సైజ్ అధికారుల సమక్షంలో హైడ్రామా జరిగింది. వివరాల ప్రకారం... ఎమ్మెల్సీ కౌంటింగ్ నేపథ్యంలో మద్యం షాపులను సోమవారం ఉదయం నుంచి సీజ్ చేశారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అమ్మకాలు జరపడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా పలివెల మారుతీ వైన్స్‌లో ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసినప్పటికి వెనుక నుంచి డోర్ తీసి మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారంతో సీఐ క్యాత్యాయని ఆధ్వర్యంలో సిబ్బంది షాపు వద్దకు చేరుకున్నారు. అప్పటికే షాపు నుంచి మద్యం కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తున్న వ్యక్తిని 28 బాటిల్స్‌తో అదుపులోకి తీసుకున్నారు. తలుపులకు తాళాలు వేయించడంతో షాపులో ఇద్దరు అమ్మకందారులు ఉండిపోవడంతో కేకలు వేయగా షాపు సీజ్ తొలగించి వారిని బయటకు తీసుకువచ్చారు. మళ్లీ యధావిధిగా సీఐ సమక్షంలో సిబ్బంది షాపు సీజ్ చేశారు. అయితే షాపుపై ఏ చర్యలు చేపట్టకుండా షాపు ఎదురుగా 28 బాటిల్స్‌తో బెల్ట్ షాపు నడుపుతున్నట్టు నల్లా వెంకట్రావుపై కేసు నమోదు చేయడంతోపాటు షాపులో ఉన్న యడ్ల ఆనందకుమార్, ఎం.సాయిసతీష్‌లపై కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన మారుతీ వైన్స్‌పై చర్యలు ఏమైనా తీసుకుంటారా అని ప్రశ్నించగా సమాధానం దాటి వేసి ముగ్గురుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

క్లాప్‌మిత్ర వేతన బకాయిల చెల్లింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

పిఠాపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామ పంచాయతీలో క్లాప్‌మిత్రగా పనిచేసిన కాటూరి లోవసత్తిబాబుకు వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పిఠాపురం ఎంపీడీవో బి.చిన్నారావు తెలిపారు. పి.రాయవరం సచివాలయంలో సత్తిబాబు పెట్రోల్ సీసాతో హల్‌చల్ చేసి సిబ్బందిపై పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించిన ఘటనపై 'పెట్రోల్ పోసి నిప్పంటిస్తా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీవోను పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వివరణ కోరారు. పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎంపీడీవో తెలిపారు. సత్తిబాబు 12 నెలలపాటు క్లాప్‌మిత్రగా పనిచేయగా, అతడికి రావాల్సిన రూ.72వేల వేతనానికి ఇప్పటికే రూ.56వేలు చెల్లించామన్నారు. బోర్ ఆపరేటర్‌గా పనిచేసిన మూడు నెలల కాలానికి రూ.9వేలు చెల్లించామని తెలిపారు. క్లాప్‌మిత్ర వేతన బకాయిలను పంచాయతీ పాలకవర్గం ఆమోదం అనంతరం నిధుల లభ్యత ఆధారంగా చెల్లిస్తామని చెప్పారు.

అన్నవరం దేవస్థానంలో మరమ్మతులు పరిశీలించిన అధికారుల బృందం

అన్నవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా త్వరలో చేపట్టబోయే పనులకు సంబంధించి దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దేవదాయ కమిషనర్‌కు లేఖ రాయడంతో మంగళవారం దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు ఆర్.కొండలరావు, ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ శేఖర్ తదితరుల బృందం పరిశీలించింది.సీతారామసత్రం తొలగింపు పనుల అంచణాలు, కొత్త, పాత సెంటినరీ ప్రకాష్‌సదన్ కాటేజీలలో మరమ్మతులు చేపట్టాలని దేవస్థానం నిర్ణయించగా దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం పనులకు సంబందించి అంచనాలు సిద్ధం చేసింది. దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి విచ్చేసిన బృందం మరమ్మతులు, నూతన పనులను దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం రూపొందించిన అంచనాలను పరిశీలించింది. ముందుగా స్వామిని దర్శించుకుని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు,ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నోడల్ సంస్థగా 'ఆదిత్య'

గండేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, యానాం జిల్లాల స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 నిర్వహించడానికి నోడల్‌సంస్థగా ఆదిత్య యూనివర్శిటీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎంపిక చేసిందని యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 నుంచి 25 ఏళ్ల పూర్తయిన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మైభారత్‌డాట్‌జీఓవిడాట్‌ఇన్ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మైభారత్ పోర్టల్‌లో కాకినాడ జిల్లాగా ఎంచుకోవాలని, రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏభాషలోనైనా వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టు యూ అనే అంశంపై ఒక నిమిషం కలిగిన వీడియో అప్లోడ్ చేయాలన్నారు. నమోదైన వారిలో 150మందిని స్క్రీనింగ్ చేసి వారికి ఆదిత్య యూనివర్శిటీలో పోటీలు నిర్వహించి 10మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి పంపుతారని జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.రాంబాబు, ఐవి రామాంజనేయులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నమోదుకు మార్చి 9 చివరి తేదీ అన్నారు. నమోదు ప్రక్రియలో సహాయం కోసం 7729990278, 9000156734 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రికెట్ బుకీలకు రిమాండ్

రాయవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రధారబందం గ్రామాల్లో ఈనెల 2వ తేదీ రాత్రి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ పట్టుబడిన ఆరుగురు క్రికెట్ బుకీలను అనపర్తి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు మంగళవారం తెలిపారు. ఆరుగురు నిందితులకు మెజిస్ట్రేట్ ఈనెల 18 వరకు రిమాండ్ విధించినట్టు ఆయన చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైలుఢీకొని గుర్తు తెలియని 60 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. రైల్వేపట్టాలపై మృతదేహం పడి ఉందని, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచామని పోలీసులు తెలిపారు.

అమలాపురం



అమలాపురంలో సమావేశమైన గ్రామ రెవెన్యూ అధికారులు

క్లస్టర్ వ్యవస్థలో వీఆర్వోలకు న్యాయం చేయాలి

అమలాపురంరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న క్లస్టర్ వ్యవస్థలో గ్రేడ్-1, 2 వీఆర్వోలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం మంగళవారం కొప్పిశెట్టి వెంకటగణేష్ అధ్యక్షతన వీఆర్వో భవనం వద్ద నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణవల్ల వీఆర్వోలకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇతర శాఖలకు సంబంధించిన సర్వేలు, పనిఒత్తిడి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సమావేశం నిర్ణయించింది. వీఆర్వోలలో అదనంగా ఉన్న సిబ్బందిని రెవెన్యూశాఖలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. సంఘ నాయకులు ఏవీఎస్ రాజేష్, మాచిరాజు వాసు, నవుండ్రు శ్రీధర్, నవుండ్రు జయరాజు, సత్యవతి, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పల్లి రాంబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ లీవ్‌లు అమలు చేయాలి

సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షాభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్టుటైమ్ ఉద్యోగులు మంగళవారం ముమ్మిడివరంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులతో వారంతా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జీవో నెం-2ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఉద్యోగులందరికీ మినిమం టైమ్‌స్కేలు, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, జీతంతో కూడిన మెడికల్ లీవ్‌లు అమలుచేయాలని తదితర డిమాండ్లతో మండల లెవెల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెస్సెంజర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఐఈఆర్పీ టీచర్లు, పార్టుటైమ్ ఇనస్ట్రక్టర్లు, పీఈటీలు నిరసనలో పాల్గొన్నారు. కె.భువనేశ్వరి, ఎస్.నాగరత్నం, కె.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, ఎన్.మనోజ్, ఆర్.రమాదేవి, ఎం.వీర్రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

మామిడికుదురు: రాష్ట్రంలోని సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు మామిడికుదురు మండల విద్యావనరుల కేంద్రంవద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. జీవో నెం.2ను రద్దుచేయాలని, ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలంటూ నిరసన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు నయినాల రాజేంద్రప్రసాద్, జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, ఎస్.మణికుమార్, వై.మధు, జి.రామకృష్ణ, హిమబిందు, నాసర్‌మెహదీ, ఫణి, లక్కింశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి

అంబాజీపేట: ఏపీ సమగ్ర శిక్షా ఉద్యోగులుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద సీఆర్ఎంటీ, ఎమ్మార్సీలు, సిబ్బంది, పార్ట్‌టైం, టీచర్లు, నిరసన తెలిపారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైంస్కేలు వర్తించే విధంగా జీవో నెం.2 రద్దు చేయాలని కోరారు.

విద్యార్థుల మానవత్వం

మలికిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద పాఠశాలలో 7, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు మానవత్వంతో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.5వేలు విలువైన నిత్యావసరాలు అందజేశారు. వీరు కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బులతో అనాథశ్రమంలో వృద్ధులకు భోజనం ఏర్పాటుచేశారు.

జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాలు

• ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి



ర్యాలీని ప్రారంభిస్తున్న పీడీ శాంతకుమారి

పి.గన్నవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా షెడ్యూల్ ప్రకారం జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ బి.శాంత కుమారి తెలిపారు. పి.గన్నవరం ఐసీడీయస్ కార్యాలయంవద్ద సీడీపీవో వై.విజయశ్రీ ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించి అనంతరం మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా గత మూడురోజులుగా సైకిల్ ర్యాలీ, ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లుల నివాసాలు సందర్శన, క్యాండిల్ ర్యాలీ, పౌష్టిక ఆహారం ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కళాశాలకు వెళ్లి మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో విజయం సాధించిన మహిళలకు సన్మానం, మండలస్థాయిలో మహిళలు 2కే రన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. చివరిరోజు జిల్లాస్థాయిలో ఉత్తమ మహిళలకు సన్మానాలు ఉంటాయన్నారు. జ్ఞానజ్యోతిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1612మంది అంగన్వాడీలకు శిక్షణా కార్యక్రమం పూర్తయిందన్నారు. మిగిలిన 114మంది అంగన్వాడీలకు త్వరలో శిక్షణా ఇస్తామన్నారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంఈవో కె.హెలీనా, సూపర్‌వైజర్లు పద్మావతి, పుణ్యవతి, విజయలత, సుబ్బలక్ష్మీ, అంగ న్వాడీలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ విజేతలకు అభినందన



కిక్ బాక్సింగ్ విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రామచంద్రపురం నియోజకవర్గ క్రీడాకారులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో అభినందించారు. రామచంద్రపురానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని కారుమూరి లేఖ నీహారిక ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు, ఒక సిల్వర్ మెడల్‌ను సాధించింది. ద్రాక్షారామకు చెందిన 6వ తరగతి విద్యార్థి అల్లం ప్రియదర్శినికార్తీక్ అదే కిక్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకాన్ని దక్కించుకున్నారు. అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులతోపాటు కోచ్ టీకే రత్నం, ప్రోత్సహించిన తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో క్యాపిటల్ ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని డాక్టర్ ఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా వచ్చిన వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ముందుగానే చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మే నెలలో ఎండల తీవ్రత తగ్గేవరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సేవాసంస్థ ఫౌండర్ కొలిశెట్టి తాతాజీ, కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, గండి దేవిహారిక, గొలకోటి విజయలక్ష్మి, తిక్కా సత్యలక్ష్మి, ఎస్ఎన్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు కుంకుమ పూజలు

అంతర్వేది, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం చినకొల్లేరులో ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ధూప దీప నైవేథ్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుని ఆలయ పరిసర ప్రాంతాల్లో విందు భోజనాలు చేశారు. ఈనెల 8న అమ్మవారిప్రభ ఊరేగింపు, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఏర్పాట్లను జిల్లా ఏసీ వి.సత్యనారాయణ పరిశీలించారు. ముందుగా ఆలయంవద్ద ఉన్న ఉపాలయాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ప్రభ ఊరేగింపు ఏర్పాట్లు, టిక్కెట్ కౌంటర్, మొక్కుబడి చెల్లింపుల స్థలాన్ని పరిశీలించారు.

వాటర్ ట్యాంకు పైకి ఎక్కి విద్యార్థిని బెదిరింపులు

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సక్రమంగా చదువుకోవడం లేదని తండ్రి మందలించడంతో మండల కేంద్రమైన ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన విద్యార్థిని అమలాపురం గాంధీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఉప్పలగుప్తానికి చెందిన విద్యార్థిని భీమవరం విష్ణు కళాశాలలో ఫైనల్‌ఇయర్ బి.ఫార్మసీ చదువుతోంది. 15 రోజులకు ఒకసారి ఇంటికి వచ్చేస్తుండడంతో సోమవారం రాత్రి తండ్రి మందలించారు. మంగళవారం ఉదయం ల్యాప్‌టాప్‌లో సినిమా చూస్తున్న కుమార్తెను తండ్రి మందలించారు. అతను అలా పొలానికి వెళ్లగానే ఆ విద్యార్థిని ల్యాప్‌టాప్ తీసుకుని అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో బంధువుల ఇంటికి వచ్చింది. ల్యాప్‌టాప్ బ్యాగును బంధువుల ఇంటివద్ద విడిచిపెట్టి అక్కడకు సమీపంలోని గాంధీనగర్‌లో నిర్మాణంలో ఉన్న వాటరు ట్యాంకు పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగింది. వెంటనే స్థానికులు, పోలీసులు, అగ్నిమాపకశాఖవారు రంగ ప్రవేశంచేసి విద్యార్థినిని రక్షించి ఇంటికి పంపించారు. అమెరికా వెళ్లి చదువుకుంటానని రెండుగంటలపాటు హంగామా చేసింది.,

'అత్యవసర సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వండి'

ఉప్పలగుప్తం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల అత్యవసర సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో కొన్ని శివారు గ్రామాల్లో రైతులు సాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ఆయన పర్యటించి తాగు, సాగునీటి సమస్యలపై రైతులతో మాట్లాడారు. అనంతరం ఉప్పలగుప్తంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన సమస్యలను కాదని ప్రభుత్వం ఇతర సమస్యలపై దృష్టి పెడుతోందని విమర్శించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా కొన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

దేవాంగ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఊటుకూరికి సత్కారం



దేవాంగ సంక్షేమసంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సత్కరిస్తున్న సంఘీయులు

అమలాపురం రూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామితోపాటు చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పిచ్చిక శ్యామ్‌లను మంగళవారం బండారులంకలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం దేవాంగ సంక్షేమసంఘ అధ్యక్షుడు కొండపల్లి రాఘవ, ఉపాధ్యక్షులు అక్కల బాబ్జి, గంపల సోమరాజు, మాడా సత్యనారాయణ, ఉప్పు బులిరాజు, ఆకాశపు శివాజీ, కొండపల్లి తేజ, కొండపల్లి చిట్టియ్య, ఆకాశపు మల్లిబాబు, చందన మల్లిబాబు, హసన్‌బాద్ దేవాంగ సంఘ నాయకులు దొంతంశెట్టి సత్యప్రకాష్, గొల్ల వీరవెంకటపల్లపరాజు, జాన మల్లిబాబు, బట్టా శ్రీను, రాష్ట్ర సంఘ నూతన ప్రతినిధులను సత్కరించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ డీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్‌చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని నారాయణపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. దీక్షలో కార్మికులు కేఎస్ఏల్వీఎన్వీ ప్రసన్న, కె.సాయిలక్ష్మి, ఎంబీఎస్ నారాయణ, ఎన్వీవీఎస్ నారాయణ, ఎస్ఎస్ రావు, సీహెచ్ రవికుమార్‌లు పాల్గొన్నారు. అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ అసోసియేషన్ డిపో కార్యదర్శి పితాని మణిరాజు ఆధ్వర్యంలో 15వ రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికులంతా ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

ఇన్ఫోసిస్‌కు 21 మంది ఎంపిక

అమలాపురంరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 21 మంది అదే కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చింతల సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం కింద రూ.2.60లక్షలు అందుతుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ పీఎస్‌వీఎస్ చలపతిరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వైసీపీని బలోపేతం చేయాలి

మామిడికుదురు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీని బలోపేతం చేసే దిశగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషిచేయాలని పి.గన్నవరం నియోజవర్గ వైసీపీ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ కోరారు. పెదపట్నంలంకలో మంగళవారం మండలశాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన వైసీపీ మండల నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ మాట్లాడారు.

శ్రీవారి సేవలో జేసీ నిశాంతి



శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాన్ని జేసీకి అందజేస్తున్న అధికారులు.

ద్వారకాతిరుమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆమెకు అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

'ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి'

అమలాపురంరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఆటో కార్మికుల సంక్షేమానికి ఏవిధమైన చర్యలు తీసుకోలేదని ఆంధ్రా ఆటోవాలా, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఈదరపల్లి వంతెనవద్ద నిరసన చేపట్టారు. యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద రూ.15వేలు చెల్లించాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు బొక్కా మంగరాజు, మోకా శ్రీనివాసరావు, మట్టపర్తి ప్రసాద్, కాశే భీమరాజు, ఏఐటీయూసీ జిల్లాకమిటీ సభ్యుడు బొలిశెట్టి గౌరీశంకర్, ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథ కాలను పొందేందుకు ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. ముక్కామల రైతు సేవా కేంద్రం వద్ద విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మా ట్లాడుతూ రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీ మా, యంత్ర పరికరాల రాయితీలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఆధార్, పాస్‌బుక్, ఫోన్ నెంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతు సెల్‌ఫోన్‌కు మూడు ఓటీపీలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు డి.దుర్గారావు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పేరాబత్తుల విజయానికి కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతలు

• ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
• జిల్లా అంతటా సంబరాలు





మంగళగిరిలో ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ నామన. ఐ.పోలవరం: గుత్తెనదీవి వేమవరంలో సంబరాలు జరుపుకుంటున్న రాజశేఖరం అభిమానులు

పి.గన్నవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి నాకు తోడై కష్టపడి పనిచేసిన కూటమి శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేశారని రాబోయే రోజుల్లో కూడా ఇదే ఒరవడి కొనసాగించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పి.గన్నవరం టీడీపీ కార్యాలయంవద్ద కూటమి నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ సమావేశం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో రాష్ట్ర టీడీపీ నాయకులు మట్టపర్తి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, నక్కా సునీల్, నాయకులు వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, బొండాడ నాగమణి, నూకపెయ్యి ప్రసన్నకుమార్, తోలేటి సత్తిబాబు, యడ్ల ఏసు, కె.సత్యనారాయణరాజు, ఉన్నారు.

రాజశేఖర్ స్వగ్రామంలో సంబరాలు

ఐ.పోలవరం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా భారీమెజార్టీతో ఘనవిజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్ స్వగ్రామం జి.వేమవరంలో అభిమానులు, కూటమి నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. జి.వేమవరం, గుత్తెనదీవి గ్రామాల్లో రాజశేఖర్ అభిమానులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల్లో రెల్లు గంగాధరం, ఆకుల సత్తిబాబు, రాయపురెడ్డి సత్యనారాయణ, కంతేటి రామకృష్ణ, త్రిమూర్తులు, కర్రి సత్యనారాయణ ఉన్నారు.

రాజశేఖర్‌కు అభినందనలు

ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతోపాటు కూటమి నాయకులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు. దాట్ల పృధ్వీరాజు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, జి.వేమవరం, గుత్తెనదీవి సర్పంచ్‌లు నల్లా సుదర్శన్, లంకలపల్లి దుర్గాదేవిమునిరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, చోడిశెట్టి బ్రహ్మానందం, ధూళిపూడి చక్రం, మద్దిరెడ్డి కుమార్, కడియం తమ్మయ్య, సలాది శేషారావు, కొండమూరి విజయబాబు, చిక్కాల శ్రీను, పెంట రవి, కోళ్ళ భద్రం తదితరులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

అమలాపురం రూరల్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించడంతో కామనగరువులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజులపూడి భీముడు, నాయకులు రాజులపూడి మహేశ్వరరావు, కామన గంగాధరరావు, దొమ్మేటి ఆదిబాబు, రాజులపూడి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాజులపూడి రామకృష్ణ, దాసరి సాయిబాబు, కుడుపూడి ప్రసాద్, రేలంగి శ్రీను, కామన చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడం పట్ల ఎన్డీఏ శ్రేణులు ఆనందోత్సాహాల్లో ఉన్నారు. రాష్ట్ర టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ అన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, మలికిపురం ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి రాజశేఖరం విజయంపై హర్షం వ్యక్తంచేశారు.

ఉప్పలగుప్తం: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయంపై మండల టీడీపీ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం పలు గ్రామాల్లో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయం కూటమి కార్యకర్తల కృషి ఫలితమని టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ వ్యాఖ్యానించారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కూటమి నాయకులు దంగేటి చిట్టిబాబు, పలచోళ్ళ పద్మనాభం, గుత్తుల శ్రీనివాస్, పలచోళ్ళ నారాయణరావు, ఎన్.చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, సుంకర రాంబాబు, పోలిశెట్టి శివాజీ, కంకటాల రామం, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, గొలకోటి సత్తిరాజు, తదితరులున్నారు.

అల్లవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం సాధించడం పట్ల రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజుతో పాటు కూటమి నాయకులు హర్షం వ్యక్తంచేసి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు, టీడీపీ నాయకులు దాట్ల గోపిరాజు, మంతెనసురేష్‌రాజు, ఆకుల లక్ష్మణరావు, అల్లు సత్తిబాబు, బండిగుప్తాపు సత్తిబాబు, జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, గుద్రం కృష్ణ, కంకిపాటి గోపి, మేడిద శంకరరావు, గునిశెట్టి చినబాబు, నల్లా రాము, పిండి గణపయ్య హర్షం వ్యక్తం చేశారు.

ముమ్మిడివరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించడం పట్ల ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ గొలకోటి దొరబాబు హర్షం వ్యక్తంచేశారు. కూటమి అభ్యర్థి రాజశేఖరం విజయానికి కృషిచేసిన తెలుగుదేశం, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు అభినంధనలు

మామిడికుదురు: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖర్‌ను మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సుజన రంగారావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలతో కలిసి మాజీ జడ్పీ చైర్మన్ నామన రాంబాబు ఘనంగా సన్మానించి అభినందించారు. ఎమ్మెల్సీగా రాజశేఖర్ విజయానికి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మెజార్టీతో గెలుపొందిన రాజశేఖర్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కుంపట్ల బాబ్జి, అక్కల రిశ్వంత్‌రాయి, నామన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం విజయ ఢంకా మోగించడంపై కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మామిడికుదురు సెంటర్, పాశర్లపూడి సెంటర్‌లో బాణసంచా కాల్చారు. మండలపార్టీ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, సర్పంచ్ సుందరనీడి చిన్నీ, ఉండ్రు శ్రీరామారావు, చుట్టుగుళ్ల కిశోర్, కొమ్ముల నందిబాబు, సాపే ఏకాదశి, కాకి శ్రీను, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి రామకృష్ణ, కృష్ణమోహన్, గంధం భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట: పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించడంతో అంబాజీపేటలో కూటమి నేతలు సంబరాలు నిర్వహించారు. స్థానిక సెంటర్లో కూటమి నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నాయకులు కొర్లపాటి గోపి, మహిపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, అరిగెల బలరామమూర్తి, గుడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

రాజోలు: ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు శుభాకాంక్షలు తెలియచేస్తూ రాజోలులో సంతమార్కెట్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు భారీ కేక్ కట్ చేసి బాణసంచాకాల్చి సంబరాలు చేశారు. బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, రాజోలు మండలం జనసేనపార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్ కసుకుర్తి త్రినాథస్వామి, అడబాల విజయ్, గుండాబత్తుల తాతాజీ, పామర్తి రమణ, బుజ్జి, రావి మురళీ, వెంకటరమణారావు, లక్ష్మీ, విజయలక్ష్మి, కుమార్ పాల్గొన్నారు.

అరుణాచల గిరికి ప్రత్యేక బస్సు

అమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం అమలాపురం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆరు రోజుల యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం పుణ్యక్షేత్రం చేరుకుంటుందన్నారు. పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత తిరుగు ప్రయాణంలో కంచి, తిరుపతి సర్వదర్శనం చేసుకుని అమలాపురం చేరుకుంటారన్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక బస్సు బయలు దేరుతుంది. భోజనం, అల్పాహారంతో కలిపి టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.5200గా నిర్ణయించారు. రిజర్వేషన్ చేయించుకునేందుకు సెల్ 7013868687, 7382909620ను సంప్రదించాలని మూర్తి కోరారు.

పశువులకు టీకాలు

అల్లవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పశువైద్య బృందాల ద్వారా పశువులు, గొర్రెల్లో ప్రమాదకర గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు చేపట్టినట్టు పశువైద్యశాఖ ఉన్నతాధికారి డాక్టర్ ఎల్.విజయారెడ్డి అన్నారు. బోడసకుర్రులో పశువులకు టీకాలు వేశారు. మార్చి 1 నుంచి నెలాఖరు వరకు ప్రతీ గ్రామంలో పశువైద్య బృందాల ద్వారా గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టామన్నారు. డాక్టర్ పూర్ణిమా నాగలక్ష్మి, సహాయకులువెంకటేశ్వరరావు, అశోక్‌లు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రం హోం సర్వే పూర్తిచేయాలి

అల్లవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఉన్న వర్క్ ఫ్రం హోం సర్వే అల్లవరం మండలంలో త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెల 8వ తేదీ నాటికి నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. సర్వేలో ప్రగతి సాధించాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. గోపాయిలంక, అల్లవరం, బోడసకుర్రుగ్రామాల్లో పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బాబ్జి, షమ్మి, లోవరాజు, అర్జున్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

అయినవిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో 23 ఏళ్ల పనిచేసి లైన్ ఇనస్పెక్టర్‌గా సేవలు అందించిన ఘనత చెరుకూరి శేషగిరిరావుకు దక్కుతుందని ఏఈ సీహెచ్ రాజేంద్రతో పాటు పలువురు వక్తలు ప్రశంసించారు. పదవీవిరమణ చేసిన శేషగిరిరావు-మంగతాయారు దంపతులను అయినవిల్లి విద్యుత్‌శాఖ కార్యాలయంవద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిదులు ఎన్.తాతాజీ, నల్లి సత్యనారాయణ, ఎంవీరమణ, ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

వంతుల వారిగా సాగునీరు

అంబాజీపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ముక్కామల లాకుల పరిధిలోని ఉన్న కాలువలకు గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలపాటు వంతులవారీగా సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. లాకుల పరిధిలోని మోడేకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, ఎస్.సావరం, బిళ్ళకుర్రు, వక్కలంక, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అయినవిల్లి మండలంలోని చింతనలంక లాకులపై ఉన్న కాలువలకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటల వరకు వంతులు వారీగా సాగునీరు అందిస్తామన్నారు.

'దువ్వాడపై చర్యలు తీసుకోవాలి'

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ప్రాంతాల మధ్య, వ్యక్తుల మధ్య రాజకీయ పార్టీల మధ్య చిచ్చు రేపేలా మాట్లాడిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన కౌన్సిలర్ గండి దేవిహారిక ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, గొలకోటి విజయలక్ష్మి, తిక్కా సత్యలక్ష్మి, నాయకులు సూదా చిన్నా, చిక్కం భీముడు, కంకిపాటి వీరబాబు, సకిలే చిట్టిబాబు, తూము రమేష్, చాట్లమంగతాయారు, ఆకేటి శ్రీను, వంగా నాయుడు పాల్గొన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

పి.గన్నవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మండలంలోని పలువురు టీడీపీ నాయకులు కోరారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేదాశి చిన్నా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీకి సుబ్రహ్మణ్యం చేసిన సేవలను గుర్తించాలని సీఎం చంద్రబాబుకి విజ్ఞప్తి చేస్తున్నట్లు వారు తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.75 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,75,676 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ పెద్దు మిథున్ చక్రవర్తి, డాక్టర్ ఉషాకిరణ్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1.16 లక్షల విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు.

దీపారాధన, క్యూ లైన్ల పనుల పరిశీలన

ఆత్రేయపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు. భక్తుల రద్దీ పెరుగుతుండటంతో వివిధ దర్శనాలకు కేటాయించిన క్యూ లైన్లను విస్తరించారు. ఆలయం ఎదురుగా ఖాళీ స్థలంలో గృహ సంకల్పం, దీపారాధన మండపం అనువైనదిగా గుర్తించి ఆ ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



క్యూ లైన్లను పరిశీలిస్తున్న ఉపకమిషనర్



రాయవరంలో చిరుధాన్యాలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అన్నానికి బదులుగా చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఐసీడీఎస్ రాయవరం ప్రాజెక్టు సూపర్‌వైజర్ సునీత అన్నారు. మంగళవారం రాయవరంలో చిరు ధాన్యాలపై తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మనిషి జీవనశైలి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. అనారోగ్యం బారినపడి మందులు వేసుకోవడానికి బదులుగా చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో తల్లి, బిడ్డలకు పోషకాలు లభించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. తల్లులకు చిరు ధాన్యాలతో చేసిన పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు తల్లులు పాల్గొన్నారు.

రసాయన రహిత ఆహారంతో ఆరోగ్యం పదిలం

ఆలమూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రసాయన రహిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు తెలిపారు. ఆలమూరు మండలం నర్సిపూడిలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు రసాయన రహిత ఆకుకూరల ప్రదర్శన, విక్రయాలు జరిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ప్రతినిధి కర్రా సూర్యప్రకాష్, ఎం.శ్రీనివాస్, తోరాటి నాగమహేశ్వరరావు, నాగబాబు, నాగసూర్యవతి, జ్యోతి, రేలంగి రాజ్యం, పి.మంజుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడిలో ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అంకంపాలెంలో సనాతన ధర్మప్రచార రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మ ప్రచార రథయాత్ర ప్రారంభం

ఆత్రేయపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం అంకంపాలెం సనాతన ధర్మప్రచార రథయాత్రను మంగళవారం ప్రారంభించారు. సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహినీ సేవా సమితి ఆధ్వర్యంలో కాశీ క్షేత్రం కన్నప్ప మఠంలో ఈ నెల 6 నుంచి 17 వరకు శివనామ సంకీర్తన సప్తాహ జ్ఞాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు రథసారథి కరుటూరి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఈ రథయాత్ర ద్వారా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం చేరుకుని అక్కడ నుంచి సుమారు 200 మందితో కాశీయాత్రకు వెళుతున్నట్లు ఆయన తెలిపారు. అక్కడ తొమ్మిది రోజులపాటు సప్తాహ మహోత్సవాన్ని జరిపి సాధువులకు అన్న, వస్త్ర దానాలు చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అంగరలో 6న నిర్వహించే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ, సిద్దయ్యస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మంగళవారం పలు పూజలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా టి.వీరభద్రాచార్యులు శిష్యులు రామచంద్రపురం వాస్తవ్యుడు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అర్చకులు అత్తిలి రామకృష్ణ శిష్య బృందంతో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితర పూజలను పలువురు దంపతులతో శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక, తదితర గ్రామాల ప్రజలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

కిక్ బాక్సింగ్ విజేతలకు కలెక్టర్ అభినందన

ద్రాక్షారామ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన రామచంద్రపురానికి చెందిన కారుమూరి శ్రీలేఖ, సిల్వర్ పతకం సాధించిన అల్లం శ్రీకార్తీక్‌ను జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ బి.కె.రత్నం పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నర్సిపూడి-పెనికేరు రోడ్డుకు మోక్షమెప్పుడో..?

• వాహనదారులకు తప్పని అవస్థలు • పట్టించుకోని అధికార యంత్రాంగం • మరమ్మతులు చేయాలని వినతి

ఆలమూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి నాటికి గుంతలు లేని రోడ్లు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వాటి మరమ్మతులపై దృష్టిపెట్టింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలమూరు మండలం నర్సిపూడి- పెనికేరు ఆర్‌అండ్‌బి రహదారికి మోక్షం కలగడం లేదు. ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు కడియం నుంచి వెదురుమూడి వరకు ఒకే రహదారిగా ఉండేది. జిల్లాల మార్పులతో కడియం నుంచి దుళ్ల వరకు ఒక రోడ్డుగా వీడదీశారు. దీంతో ఆలమూరు మండలం నర్సిపూడి నుంచి పెనికేరు వరకు ఒక రోడ్డుగా, పెనికేరు నుంచి వెదురుమూడి వరకు మరో రోడ్డుగా మూడుగా వీడదీశారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉన్న రాజమండ్రి రూరల్ నియోజకవర్గ పరిధిలోని కడియం నుంచి దుళ్ల వరకు రోడ్డును నిర్మించారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని పెనికేరు నుంచి వెదురుమూడి వరకు రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. నర్సిపూడి-పెనికేరు రోడ్డును మాత్రం అధికారులు వదిలిపెట్టారు. గుంతలుగా ఉన్న ఈ రోడ్డుపై నర్సిపూడి, నవాబుపేట, పెనికేరు గ్రామస్తులతోపాటు కడియం నుంచి ఆలమూరు మండలానికి వచ్చే వారికి అవస్థలు తప్పడం లేదు. అలాగే ఆలమూరు నుంచి కడియం మండలానికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ రహదారిలో ద్విచక్రవాహనదారులు ఎన్నోసార్లు పడిపోయి గాయపడిన ఉదంతాలున్నాయి. కూటమి ప్రభుత్వం ఇక్కడి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన పెనికేరు-నర్సిపూడి రోడ్డు



చింతలూరు నూకాంబిక అమ్మవారికి వెండిని బహూకరిస్తున్న దాతలు

నూకాంబిక అమ్మవారికి వెండి బహూకరణ

ఆలమూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారికి వెండి ఆభరణాలు చేయించాలని గ్రామస్తుల కృషిలో భాగంగా ఆలమూరుకు చెందిన నెక్కంటి శ్రీనివాస్, పద్మావతి దంపతులచే రూ.25వేల విలువైన వెండిని బహూకరించారు. ఆభరణాల తయారీకి దీన్ని ఉపయోగించాలని గ్రామస్తులకు నూకాంబిక అమ్మవారి సమక్షంలో దాతలు అందించారు. ఇప్పటికే అమ్మవారికి దాతల సహకారంతో పలు వెండి ఆభరణాలు చేయించి బహూకరించిన విషయం విదితమే. వెండిని బహూకరించిన దంపతులను పలువురు అభినందించారు.



నీటి సమస్యపై ఇరిగేషన్ జేఈతో మాట్లాడుతున్న నీటి సంఘం అధ్యక్షులు, రైతులు

సాగునీటి సమస్యపై సంఘాల అధ్యక్షుల ఆందోళన

కె.గంగవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎద్దడిపై నీటి సంఘాల అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కోటిపల్లి డీసీ అధ్యక్షుడు దాట్ల విజయ్ గోపాల్‌బాబు, ఉపాధ్యక్షుడు తాడాల లోవరాజు, కోట నీటి సంఘం అధ్యక్షుడు ములకల విశ్వేశ్వరరావు, దంగేరు నీటి సంఘం అధ్యక్షుడు గోపి సతీష్ రైతులతో కలిసి కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయానికి వచ్చారు. వంతుల వారి విధానంలో సబ్ డివిజన్‌కు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తారు. వంతు సమయం కేవలం రెండు రోజులు మాత్రమే ఉండటంతో సబ్ డివిజన్ పరిధిలో 17వేల ఎకరాలకు నీరు ఎలా సరఫరా అవుతుందని అధికారులను నిలదీశారు. గతంలో వంతులేని సమయంలో కూడా కొంత నీరు వచ్చేదని ప్రస్తుతం వంతలేని సమయంలో కాలువలను మూసి వేస్తున్నారని దీనివల్ల పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని వాపోయారు. ఒకదశలో డీఈఈ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పై అధికారుల సూచనల మేరకు నడుచుకుంటామని తాము చేసేదేమీ లేదని అధికారులు చేతులెత్తేశారు. నీటి సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ అధికారులు వెంటనే మురుగు కాలువలకు క్రాస్ బండ్‌లు వేసి ఇంజన్లతో నీరుతోడి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు.

ఎమ్మెల్సీ పేరాబత్తుల విజయంపై సంబరాలు

ఆలమూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయంపై మండలంలో కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టభద్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆలమూరుతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు జరిపారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల విజయం సాధించడంపై కూటమి నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, రావిపాటి గణేష్ చౌదరి తదితరులు ఉన్నారు.



కొత్తపేటలో పేరాబత్తుల రాజశేఖరం విజయంపై టీడీపీ శ్రేణుల సంబరాలు

పట్టభద్రుల నమ్మకానికి ఇది నిదర్శనం

మాజీ ఎమ్మెల్సీ చౌదరి

రాయవరం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసాన్ని పట్టభద్రులు మరోసారి నిరూపించారని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి(కూర్మాపురం అబ్బు) అన్నారు. మంగళవారం మండలంలోని కూర్మాపురంలో ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్ గెలుపొందడంతో మంగళవారం కూటమి నేతలు సంబరాలు జరిపారు. పాత బస్టాండ్ సమీపంలో బాణసంచా కాల్చి వేడుక జరుపుకున్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, బూసి భాస్కరరావు, ముత్యాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖరం విజయంపై కూటమి నేతలు సంబరాలు జరిపారు. రావులపాలెంలో కూటమి శ్రేణులు సంబరాలు జరిపి ఇంతటి విజయానికి కృషి చేసిన పట్టభద్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయం సాధించడంపై కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆత్రేయపురం మండలంలోని ఆయా గ్రామాల్లో కూటమి శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తుల గెలుపు ప్రజల విజయం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం ప్రజల విజయమని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాజశేఖర్ విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో వున్నారు.

పట్టభద్రుల తీర్పు చారిత్రాత్మకం



సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

ద్రాక్షారామ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయం చారిత్రాత్మకం అని కూటమి నాయకులన్నారు. మంగళవారం రాజశేఖరం విజయం సాధించడంతో రామచంద్రపురంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి నాయకుల ఆధ్వర్యంలో రాజగోపాల్ సెంటర్‌లో కేకు కోసి బాణసంచా కాల్చారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ ఇది సమష్టి విజయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, టీడీపీ నాయకులు జాస్తి విజయలక్ష్మి, చైట్ల గజలక్ష్మి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పూతరేకుల్లో కల్తీ నెయ్యి నివారణను అడ్డుకుంటాం'

ఆత్రేయపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పూతరేకుల తయారీలో కల్తీ నెయ్యి ఆరోపణల నేపథ్యంలో కల్తీ నివారణను అడ్డుకుంటామని వ్యాపారస్తులు తీర్మానించారు. మంగళవారం ఆత్రేయపురం టీటీడీ కల్యాణ మండపంలో పూతరేకుల వ్యాపారులు సమావేశం జరిపారు. పూతరేకులు తయారీలో కల్తీ నెయ్యి ఆరోపణల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు జరిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వాటి తయారీదారులు కంపెనీ బ్రాండులకు చెందిన నెయ్యిని వినియోగిస్తామని నిర్ణయించుకున్నారు. పూతరేకుకు జియోగ్రాఫికల్ ఐడెంటీ పొందిన నేపథ్యంలో పూతరేకుల తయారీలో నాణ్యతా, ప్రమాణాలు కాపాడాలని తీర్మానించారు. అనంతరం సంఘ అధ్యక్షుడిగా కాసా బసవయ్య, ఉపాధ్యక్షుడిగా యాతం నాగశివకుమార్, కార్యదర్శిగా మట్టా బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారిగా చిన్నం సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభకు ఆడిటర్ అల్లం ప్రసాద్ హాజరై సంఘ అభివృద్ధికి పలు సూచనలు చేశారు.



పూతరేకుల వర్తక సంఘ సమావేశం దృశ్యం

కె.గంగవరంలో మహిళా దినోత్సవం

కె.గంగవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం వెలుగు కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.చంద్రకళ, ఎం.పార్వతి, పి.అనురాధ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మండలంలోని డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పట్టణ సీఐ దారం సురేష్ సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వివిధ రకాల డ్రాయింగ్ తోపాటు, వ్యాసరచన, ఉపన్యాసాలు చేశారు. విజేతలకు 8న బహుమతులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి, పోలీసు సిబ్బంది, సెయింట్ ఆన్స్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగుల నిరసన

ద్రాక్షారామ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షాభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు మంగళవారం విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. భోజన విరామంలో ప్లకార్డులతో జేఏసీ జిల్లా కన్వీనర్ చొప్పెల్ల వెంకన్నబాబు ఆధ్వర్యంలో వారు నినాదాలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఆత్రేయపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు దంపతులు పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేదపండితులు సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో వీటిని నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు.

అనుమానంతో భార్యపై దాడి

కె.గంగవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన కర్రి లక్ష్మిపై అనుమానం పెంచుకున్న భర్త సత్యనారాయణ భార్యపై దాడికి పాల్పడి గాయపర్చాడు. పామర్రు ఎస్ఐ ఎస్కే జానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం నాని, లక్ష్మిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇటీవల మరొకరితో ఆమె చనువుగా మాట్లాడటంపై కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. సోమవారం అత్తా, కోడలికికు ఈ విషయంపై మళ్లీ వాగ్వాదం తలెత్తింది. చేపల వేటకు వెళ్లి వచ్చిన భర్త విషయం తెలుసుకోవడంతో మళ్లీ వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈనేపథ్యంలో భార్య గొంతులో పొడవడంతో గాయపడిన ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఆర్‌టీయూ హర్షం

కె.గంగవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా డాక్టర్ గాదే శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడంపై పీఆర్‌టీయూ జిల్లా శాఖ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అమృతరావు మాట్లాడారు. మూడవసారి ఈయన విజయం సాధించడంపై పీఆర్‌టీయూ జిల్లా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్ విజయం సాధించడంపై పీఆర్‌టీయూ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నేతలు అమృతరావు, డి.సురేష్ బాబు తదితరులు ఉన్నారు.



తడిపొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

మండపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పట్టణ వ్యాపారులను హెచ్చరించారు. స్వచ్ఛ మండపేట లక్ష్యంగా పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మండపేటలో మంగళవారం ధర్మగుండం చెరువు వద్దనున్న వార్డులో ప్రజలకు తడి పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ధర్మగుండం చెరువు వద్ద రోడ్డుపై మెటీరియల్ వేసిన వ్యాపారికి ఆయన జరిమానా వేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్లు అంజనేయులు, పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం సుజాత, వార్డు శానిటేషన్ కార్యదర్శులు తదితరులు వున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మండపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాపేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్, ఏడిద జిల్లా పరిషత్ హైస్కూల్, ద్వారపూడి, జిల్లా పరిషత్ హైస్కూల్, బాలికల హైస్కూల్, మండపేట జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, సెయింట్ ఆన్స్ పాఠశాల, భాష్యం పాఠశాలల్లో టెన్త్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీ

రావులపాలెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం భవిత సెంటర్లో పారా సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమారావు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులు వారి అవసరాలు చక్కదిద్దుకునేలా తయారు చేయాలన్నారు. అనంతరం ఎంఈవో శ్రీనివాసరాజు, కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, తారా డైరెక్టర్ థామస్ ఫలిస్థానం, విభిన్న ప్రతిభావంతులకు వీల్‌ఛైర్లు, బోధనావసరాలకు ఉపయోగపడే పరికరాలు అందించారు.